నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I హైదరాబాద్, గురువారం 12 సెప్టెంబర్ 2024 YADADRI BHUVANAGIRI

17న జాతీయ జెండా ఎగురవేయనున్న గుత్తా..

- ఈ సారి కూడా బీర్ల ఐలయ్యకు నో ఛాన్స్
- జనగాంలో ఆవిష్కరించనున్న ప్రభుత్వ విప్

యాదాద్రి భువనగిరి, సెప్టెంబర్ 11 (నమస్తే తెలంగాణ) : ఈ నెల 17న ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి జిల్లాలో జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. ఈ మేరకు సీఎస్ శాంతి కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించి, ప్రజాపాలన దినోత్సవం కార్యక్రమానికి గుత్తా ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. కాగా గత నెల స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కూడా గుత్తా జాతీయ జెండాను ఎగురవేశారు. జిల్లాలో ప్రభుత్వ విప్ ఉన్నప్పటికీ గుత్తాకు ఇవ్వడంపై వివిధ వర్గాల నుంచి విమర్శలు వచ్చాయి. మరోసారి గుత్తాకే ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. కాగా బీర్ల ఐలయ్యకు మాత్రం స్వాతంత్ర్య దినోత్సవం రోజు జనగాంలో జాతీయ జెండా ఆవిష్కరించగా, ఇప్పుడు కూడా అక్కడే ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.

యాదాద్రి పవర్ ప్లాంట్ రెండో యూనిట్‌లో ఆయిల్ సింక్రనైజేషన్ ద్వారా పవర్ ఉత్పత్తి ట్రయల్ రన్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

ఈ ఏడాది చివరి వరకు మూడు యూనిట్లు పూర్తి

- భూ నిర్వాసితులకు ప్లాంట్‌లోనే ఉద్యోగాలు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డితో కలిసి యాదాద్రి పవర్ ప్లాంట్ పనుల పరిశీలన
- రెండో యూనిట్‌లో ఆయిల్ సింక్రనైజేషన్‌తో ట్రయల్‌రన్

నల్లగొండ ప్రతినిధి, సెప్టెంబర్11(నమస్తే తెలంగాణ) /దామరచర్ల : యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్టులో ప్రస్తుతం పనులు వేగంగా జరుగుతున్నాయని, ఈ ఏడాది చివరి వరకు మూడు యూనిట్లను రన్ చేయనున్నామని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి బుధవారం ఆయన హెలికాప్టర్‌లో దామరచర్లలోని యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌కు వచ్చి పనులను పరిశీలించారు. అనంతరం అక్కడే ఉన్నతాధికారులతో పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా రెండో యూనిట్‌లో ఆయిల్ సింక్రనైజేషన్ ద్వారా పవర్ ఉత్పత్తి ట్రయల్ రన్‌కు స్విచ్‌ఆన్ చేశారు. అనంతరం ప్లాంట్ కాన్ఫరెన్స్ హాల్‌లో భట్టి మీడియాతో మాట్లాడారు. ఈ డిసెంబర్ 31 నాటికి మూడు యూనిట్లలో 2,400 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. వచ్చే ఏడాది మార్చి చివరి నాటికి మిగతా రెండు యూనిట్లను కూడా పూర్తి చేసి మొత్తం 5 యూనిట్ల ద్వారా పూర్తి సామర్థ్యంతో విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభిస్తామన్నారు. మార్చి31 నాటికి విద్యుత్ అందించేందుకు సివిల్ పనులతో పాటు రైల్వే లైన్ పనులను కూడా వేగవంతం చేయనున్నట్లు చెప్పారు. రైల్వే లైన్ అందుబాటులోకి తేవడం వల్ల బొగ్గు రవాణా వ్యయం కూడా తగ్గుతుందన్నారు. ఇదే వేగంతో ప్లాంట్‌ను పూర్తి చేయడం ద్వారా యూనిట్ విద్యుత్‌ను 6.35రూపాయలకు ఇచ్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రాజెక్టు పూర్తయ్యే నాటికి ఖర్చును లెక్కకట్టి యూనిట్ ధర ఎంత అవుతుందనేది ఈఆర్‌సీ నిర్ణయిస్తుందని చెప్పారు. ప్రాజెక్టు నిర్మాణానికి ప్రజలు వారి ఎంతో విలువైన భూములను ఇచ్చి త్యాగం చేశారని, అలాంటి భూ నిర్వాసితులకు భూసేకరణ నిధులతోపాటు, ప్రాజెక్టులో తప్పనిసరిగా ఉద్యోగాలు కల్పిస్తామని తెలిపారు. ప్లాంటు ప్రారంభ సమయంలో ఇచ్చిన మాట ప్రకారం నిర్వాసితుల కుటుంబాల్లో నిరుద్యోగులైన వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ యాదాద్రి ప్లాంట్‌తోపాటు పులిచింతల ప్రాజెక్టులో భూములు కోల్పోయిన వారికి ఉద్యోగాలు కల్పిస్తామని డిప్యూటీ సీఎం ఆదేశాలిచ్చారని, వారికి నిర్వాసితుల తరపున ధన్యవాదాలు తెలిపారు. వారి వెంట జెన్‌కో సీఎండీ రోనాల్డ్ రోస్, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్, ప్రాజెక్టు డైరెక్టర్లు సచ్చిదానంద, అజయ్, ప్రాజెక్టు చీఫ్ ఇంజినీర్ సమ్మయ్య, తదితరులు ఉన్నారు.

మంత్రులను నిలదీసిన నిర్వాసితులు

యాదాద్రి పవర్‌ప్లాంటుకు వచ్చిన డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డిని పవర్ ప్లాంట్ భూ నిర్వాసితులు, ల్యాండ్ లూసర్స్ బాధితులు అడ్డుకున్నారు. పవర్ ప్లాంట్‌కు భూములు ఇచ్చిన తమకు ఇంతవరకు ఎలాంటి ఉపాధి, ఉద్యోగాలు కల్పించలేదన్నారు. ధ్రువీకరణ పత్రాలు ఇచ్చారు కానీ ఉద్యోగాలు ఇవ్వలేదని వారిని నిలదీశారు. దీంతో స్పందించిన మంత్రులు నిర్వాసితులకు న్యాయం చేస్తామని, ప్లాంటుకు భూములు ఇచ్చిన నిర్వాసితులు దేవుళ్లతో సమానమని తెలిపారు. మూడు నెలల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని అధికారులను ఆదేశించామని చెప్పడంతో నిర్వాసితులు ఆందోళన విరమించారు.

యాదాద్రి పవర్ ప్లాంట్ వద్ద డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని భూ నిర్వాసితులు నిలదీయడంతో వారికి సమాధానం చెప్తున్న దృశ్యం

ఓటుకు 25 వేలు..!

మదర్ డెయిరీ డైరెక్టర్ల ఎన్నికల్లో కాంగ్రెస్ ఆఫర్

- ప్రలోభాలు, తాయిలాలతో ఎర.. క్యాంప్ రాజకీయాలకు తెర
- హైదరాబాద్ క్యాంప్‌లో మందు, విందు, చిందు.
- అత్యధిక మంది ఓటర్లున్నా ధీమా లేని హస్తం పార్టీ
- గెలిచేందుకు బీఆర్ఎస్ పకడ్బందీ వ్యూహాలు
- చక్రం తిప్పుతున్న గొంగిడి మహేందర్ రెడ్డి
- రేపు హయత్‌నగర్‌లో ఆరు డైరెక్టర్ స్థానాలకు ఎన్నిక

ఉమ్మడి నల్లగొండ- రంగారెడ్డి జిల్లాల పాల ఉత్పత్తిదారుల సంఘం (మదర్ డెయిరీ) ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రలోభాలకు తెరలేపింది. అధికారంలో ఉండటంతో ఎలాగైనా గెలవాలని అడ్డదారులు తొక్కుతున్నది. ఓటర్లైన పాల సంఘం చైర్మన్లకు తాయిలాలతో ఎర వేస్తున్నది. ఒక్కో ఓటరుకు రూ. 25వేలు ఆఫర్ చేసింది. ఇప్పటికే ఓటర్లను క్యాంప్‌లకు తరలించి దావత్‌లతో ముంచెత్తుతున్నది.

– యాదాద్రి భువనగిరి, సెప్టెంబర్ 11 (నమస్తే తెలంగాణ)

మదర్ డెయిరీ ఎన్నికలు ఉమ్మడి జిల్లాలో కాక రేపుతున్నాయి. ఎన్నికలను బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. ఆరు డైరెక్టర్ స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. ఇందులో ఉమ్మడి నల్లగొండలో నాలుగు, రంగారెడ్డి జిల్లాలో రెండు స్థానాలు ఉన్నాయి. కాంగ్రెస్ తరపున ఆరుగురు, బీఆర్ఎస్ నుంచి 12 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. మొత్తంగా 297 మంది పాల సొసైటీ చైర్మన్లుగా ఓటర్లు ఉన్నారు. వీరందరు కలిసి ఆరుగురిని డైరెక్టర్లుగా ఎన్నుకోనున్నారు. ఇప్పటికే ఆయా అభ్యర్థుల సీరియల్ నంబర్లు కేటాయించారు. ఈ నెల 13న హయత్ నగర్‌లోని మదర్ డెయిరీ ప్రధాన కార్యాలయంలో అభ్యర్థుల ఎన్నిక నిర్వహించనున్నారు.

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 12 అసెంబ్లీ స్థానాల్లో 11 సీట్లలో కాంగ్రెస్ గెలిచింది. అయితే బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య గట్టి పోటీ నెలకొంది ఉంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ఎలాగైనా చైర్మన్ పీఠం దక్కించుకోవాలని, లేకుంటే పరువు పోతుందనే భావనలో ఉన్నట్లు తెలుస్తున్నది. ఆలేరు నియోజకర్గంలో అత్యధికంగా ఓటర్లున్న బీర్ల ఐలయ్యకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. దీంతో ఒక్కో ఓటరుకు రూ. 25వేలు ఆఫర్ చేసినట్లు విశ్వసనీయ సమాచారం. అది కూడా ఎన్నికకు కొంత సమయం ముందే ఇచ్చేట్లు సంప్రదింపులు జరిపినట్లు తెలుస్తున్నది.

పరువు పోతుందని ఆఫర్..!

క్యాంప్ రాజకీయాలకు తెర..

పాల సంఘం చైర్మన్లు కాంగ్రెస్‌కు చెందిన వారే ఉన్నప్పటికీ ఆ పార్టీకి గెలుపుపై ధీమా లేదని తెలుస్తున్నది. దీంతో ఓటర్లను కాపాడుకునేందుకు క్యాంప్ రాజకీయాలకు తెరదీశారు. అందరినీ హైదరాబాద్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌కు తరలించారు. క్యాంప్‌కు తరలించే ముందే రూ. 25వేల హామీ ఇచ్చారు. ప్రస్తుతం క్యాంప్‌లో 150 మంది వరకు ఉన్నట్లు సమాచారం. వీరికి ఎప్పటికప్పుడు సకల సదుపాయాలు కల్పిస్తున్నారు. మందు, బిర్యానీలతో దావత్‌లు చేస్తున్నారు. బెడ్లు, పరుపులు, ఫ్యాన్లు, ఏసీలు తెప్పించి మంచి మర్యాదలు చూసుకుంటున్నారు. ఓటర్లను ఈ నెల 13వరకు క్యాంప్‌ల్లోనే కొనసాగించి.. అదే రోజు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కొనసాగే ఓటింగ్ వద్దకు తరలించనున్నారు. మరోవైపు బీజేపీ, కమ్యూనిస్ట్ మద్దతుదారులు ఉండగా, వారిని కూడా క్యాంప్‌లకు రప్పించేందుకు ప్లాన్ చేస్తున్నారు.

గులాబీ పార్టీ పకడ్బందీ వ్యూహాలు..

అధికార కాంగ్రెస్ పార్టీకి దీటుగా బీఆర్ఎస్ ఎత్తులకు పై ఎత్తులు వేస్తున్నది. ఎన్నికను సీరియస్‌గా తీసుకొని పకడ్బందీ వ్యూహాలు రచిస్తున్నది. డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి ముందుండి అన్నీ తానై చూసుకుంటున్నారు. తమ ఓటర్లను కాపాడుకుంటూనే.. అవతలి ఓటర్ల మద్దతు కూడగట్టేలా చక్రం తిప్పుతున్నారు. ఆయన కున్న సంబంధాలు, పరిచయాలతో తమ వైపు తిప్పుకొనే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే గులాబీ పార్టీ తరపున అభ్యర్థులు ఓటర్లను వ్యక్తిగతంగా కలుస్తూ తమ అభ్యర్థిత్వానికి మద్దతు తెలపాలని ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ తరపున యాదాద్రి జిల్లా నుంచి సందిల భాస్కర్, మారెడ్డి కొండల్ రెడ్డి, ఒగ్గు భిక్షపతి, డి.సోమిరెడ్డి పోటీలో ఉన్నారు. ఈ నలుగురు కచ్చితంగా గెలుస్తారని గులాబీ పార్టీ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

పరిపాలనలో కాంగ్రెస్ విఫలం

- కమీషన్ల కోసమే హైడ్రా ఏర్పాటు
- పేదల జీవితాలతో చెలగాటమాడుతున్న గుంపు మేస్త్రీ
- విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

కేతేపల్లి, సెప్టెంబర్ 11 : కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు జరిగి పది నెలలు దాటినా పరిపాలనలో పూర్తిగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య విమర్శించారు. మండల పరిధిలోని ఇనుపాములలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రతిపక్షాలపై చిల్లర మాటలు మాట్లాడటం మినహాయించి సీఎం రేవంత్‌రెడ్డికి ఏమీ తెలియడం లేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలకు విష జ్వరాలు ప్రబలడంతో ప్రభుత్వ దవాఖానలు కిక్కిరిసిపోతున్నాయని, ఆసుపత్రుల్లో కనీస సౌకర్యాలను కల్పించడంలో, మందుల కొరతపై దృష్టి పెట్టడం లేదని తెలిపారు. రూ.2 లక్షల రుణమాఫీ ఇంత వరకు పూర్తి చేయకపోవడం ప్రభుత్వ చేతకాని తనానికి నిదర్శనమన్నారు. వానకాలం పంటకాలం పూర్తికావస్తున్నప్పటికీ ప్రభుత్వం రైతు బంధు ఊసెత్తకపోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. దేవుళ్ల మీద ప్రమాణాలు చేసి మాటతప్పడం సీఎం రేవంత్‌రెడ్డికే చెల్లిందన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో మంత్రులుగానీ, ఎమ్మెల్యేలుగానీ అందుబాటులో లేకుండా ప్రజలను గాలికి వదిలేశారని దుయ్యబట్టారు. ప్రత్యేకాధికారుల పాలనలో గ్రామాలు చిన్నాభిన్నం అవుతున్నాయని, పారిశుధ్య పనులు పనులు చేపట్టక పోవడంతో విషజ్వరాలు వ్యాపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచుల పదవీకాలం ముగిసి ఏడు నెలలు దాటినప్పటికీ ఇంత వరకు గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించకపోవడమేంటని ప్రశ్నించారు. అన్ని విధాలుగా నమ్మించి మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో కేవలం కమీషన్ల కోసమే హైడ్రాను తెరమీదకు తీసుకువచ్చారని విమర్శించారు. హైడ్రా ఏర్పాటుతో పేద, మధ్యతరగతి కుటుంబాల ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని, పేదల జీవితాలతో చెలగాటమాడుతూ గుంపుమేస్త్రీ కాలం గడుపుతున్నాడని మండిపడ్డారు. సమావేశంలో మాజీ జడ్పీటీసీ బొప్పని స్వర్ణలతాసురేశ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మారం వెంకట్‌రెడ్డి, నాయకులు కొప్పుల ప్రదీప్‌రెడ్డి, జాల వెంకట్‌రెడ్డి, ఎం.రాగ్ని, జి.సత్యనారాయణగౌడ్, సీహెచ్.గోపాల్‌గౌడ్ పాల్గొన్నారు.

జీతాలు ఇవ్వాలని నిరసన వ్యక్తం చేస్తున్న మిషన్ భగీరథ క్షేత్రస్థాయి సిబ్బంది (ఫైల్)

మిషన్ భగీరథ సిబ్బందికి జీతాల్లేవ్!

- నాలుగు నెలలుగా వేతనాలు ఇవ్వని రాష్ట్ర సర్కారు
- అప్పులు చేసి కుటుంబాలను పోషిస్తున్నవైనం
- గ్రామాలకు నీటి సరఫరాపై ప్రభావం
- ధర్నాలు, ఆందోళనలు చేసినా పట్టించుకోని ప్రభుత్వం

నేరేడుచర్ల, సెప్టెంబర్ 11 : ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీటిని అందించే లక్ష్యంతో మాజీ సీఎం కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా మిషన్ భగీరథ పథకాన్ని తీసుకొచ్చారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఇది విజయవంతంగా అమలైంది. మిషన్ భగీరథ సిబ్బందికి ప్రతి నెలా సకాలంలో జీతాలు అందించింది. ఎక్కడా నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తలేదు. కానీ కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత మిషన్ భగీరథ నిర్వహణ గాడి తప్పింది. క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బందికి వేతనాలు ఇవ్వకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. అనేక గ్రామాలకు తాగునీటి సరఫరా సక్రమంగా కాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

వేతనాలు అందక అవస్థలు

నల్లగొండ జిల్లా మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలోని అవంతీపురం వద్ద ఉన్న మిషన్ భగీరథ ప్లాంట్ నుంచి సూర్యాపేట జిల్లాలోని హుజూర్‌నగర్, కోదాడ, సూర్యాపేట, నల్లగొండ జిల్లాలోని మిర్యాలగూడ నియోజకవర్గాల్లోని గ్రామాలకు మిషన్ భగీరథ నీటిని అందిస్తున్నారు. దీని కోసం వాల్ ఆపరేటర్లు, ఫిట్టర్లు, సూపరవైజర్లు ఇలా సుమారు 400 మంది క్షేత్రస్థాయిలో సిబ్బంది పని చేస్తున్నారు. వీరికి రూ.10 వేల నుంచి రూ.15వేల వరకు వేతనాలుంటాయి. కానీ జూన్, జూలై, ఆగస్టు నెలల జీతాలను ప్రభుత్వం ఇవ్వలేదు. ప్రస్తుతం నాలుగో నెల కూడా జీతాలు రాలేదు. జీతాలు లేక ఆర్థికంగా చాలా ఇబ్బంది పడుతున్నామని, అప్పులు చేసి కుటుంబాన్ని పోషించుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మిర్యాలగూడ డివిజన్ పరిధిలోని అవంతీపురం వద్ద ఉన్న మిషన్ భగీరథ ప్లాంట్

కుటుంబ పోషణ కష్టంగా మారింది

మాకు నాలుగు నెలలు నుంచి జీతాలు రావట్లేదు. రాత్రీపగలు పని చేసి తాగు నీటి సరఫరాలో ఇబ్బందు ల్లేకుండా చూస్తున్నం. ఇంత కష్టపడ్డా ఫలితం లేదు. కుటుంబ పోషణకు అష్టకష్టాలు పడుతున్నం. ఇకనైనా సర్కారు స్పందించి సకాలంలో జీతాలు ఇవ్వాలి.

-సందీప్ రెడ్డి, మిషన్ భగీరథ సూపర్‌వైజర్

అసలే జీతాలు తక్కువ

అవంతీపురంలోని మిషన్ భగీరథ ప్లాంటు నుంచి నాలుగు నియోజకవర్గాలకు నీటిని సరఫరా చేయడం కోసం సుమారు 400 మంది సిబ్బంది పని చేస్తున్నారు. మాకు ఇచ్చే జీతం కూడా చాలా తక్కువే. ఆ డబ్బులు కూడా నెల నెలా ఇవ్వడం లేదు. నాలుగు నెలలుగా అవస్థలు పడుతున్నాం. ప్రభుత్వం చొరవ తీసుకొని మా వేతనాలు విడుదల చేయాలి.

-రవి, మిషన్ భగీరథ లైన్‌మన్

బునాదిగాని కాల్వ నిర్మాణంపై ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలి

కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు, చిత్రంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు

- మూసీ ప్రాంతంలో గోదావరి జలాలు అందించేందుకు డీపీఆర్ రూపొందించాలి
- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు

భువనగిరి కలెక్టరేట్, సెప్టెంబర్ 11 : బునాదిగాని కాల్వకు నిధులు మంజూరు చేసి గోదావరి జలాలు అందించాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రెండు రోజుల నుంచి చేపట్టిన మోటార్ సైకిల్ యాత్ర బుధవారం భువనగిరి పట్టణ కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా భారీ బైక్ ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. భువనగిరి జిల్లాకు ఆధారంగా ఉన్న చిన్న నీటి వనరులపై బునాదిగాని కాల్వ నిర్మాణంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదన్నారు. బీబీనగర్ మండలం మక్తా అనంతారం నుంచి వలిగొండ మండలం పహిల్వాన్‌పురం మీదుగా అడ్డగూడూరు మండలం ధర్మారం వరకు 98 కిలోమీటర్లు కాల్వ పూర్తి చేయాల్సి ఉండగా 18 సంవత్సరాల్లో కేవలం 34 కిలోమీటర్లు మాత్రమే పూర్తి చేశారని, ఇప్పటివరకు కేవలం రూ.34 కోట్లు ఖర్చు చేశారని అన్నారు. కాల్వను పూర్తి చేయడం కోసం రూ.269 కోట్ల ప్రతిపాదనలు అధికారులు పంపినా ప్రభుత్వం నేటికీ ఒక్క రూపాయి కూడా బడ్జెట్ ప్రకటించలేదని తెలిపారు. వెంటనే నిధులు విడుదల చేసి కాల్వ పూర్తి చేసేందుకు భువనగిరి, ఆలేరు, తుంగతుర్తి ఎమ్మెల్యేలు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని సూచించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ మాట్లాడుతూ బునాదిగాని కాల్వ భీమలింగం కాల్వల ద్వారా సాగుతున్న మూసీ కాలుష్యాన్ని నిర్మూలించేందుకు అవకాశాలున్నాయన్నారు. శామీర్‌పేట చెరువు నుంచి గోదావరి జలాలను వడపర్తి కత్వా వద్ద ఎడమ కాల్వ ద్వారా బీబీనగర్ చెరువు నింపవచ్చని, భువనగిరి, బీబీనగర్ మండలాలకు నీరు అందించవచ్చని తెలిపారు. ప్రభుత్వం వెంటనే డీపీఆర్‌ను రూపొందించాలని డిమాండ్ చేశారు. బునాదిగాని కాల్వపై కార్యాచరణ రూపొందించని పక్షంలో ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం అదనపు కలెక్టర్ గంగాధర్‌కు వినతి పత్రం అందజేశారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నరసింహ అధ్యక్షతన నిర్వహించిన ఈకార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు, కల్లూరి మల్లేశం, దాసరి పాండు, జిల్లా కమిటీ సభ్యులు సిర్పంగి స్వామి, దయ్యాల నరసింహ, బొల్లు యాదగిరి, మాయ కృష్ణ, గడ్డం వెంకటేశ్, రాచకొండ రాములమ్మ, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కోమటిరెడ్డి చంద్రారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు పైళ్ల యాదిరెడ్డి, మండలాల కార్యదర్శులు గాడి శ్రీనివాస్, రేకల శ్రీశైలం, పోతరాజు జహంగీర్, పీఎన్ఎమ్ జిల్లా కార్యదర్శి ఈర్లపల్లి ముత్యాలు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లావుడియా రాజు, నాయకులు ఎదురూరి మల్లేశం, పల్లెర్ల అంజయ్య, తుర్కపల్లి సురేందర్, చీర్క శ్రీశైలంరెడ్డి, బండారు శ్రీరాములు, ప్రసాదం విష్ణు, బందుల ఎల్లయ్య, పల్లె మధు కృష్ణ, ఓవల్‌దాస్ అంజయ్య, అబ్దుల్లాపూర్ వెంకటేశ్, వాకిటి వెంకట్‌రెడ్డి, బుగ్గ చంద్రమౌళి, వడ్డబోయిన వెంకటేశ్ పాల్గొన్నారు.

జిల్లా గెజిటెడ్ ఉద్యోగుల అసోసియేషన్ నూతన కార్యవర్గంతో అదనపు కలెక్టర్ గంగాధర్

అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో ఉద్యోగుల పాత్ర కీలకం

- అదనపు కలెక్టర్ గంగాధర్
- జిల్లా గెజిటెడ్ ఉద్యోగుల అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

భువనగిరి కలెక్టరేట్, సెప్టెంబర్ 11 : రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ఫలాలను ప్రజలకు అందించడంలో ఉద్యోగుల పాత్ర గొప్పదని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కె.గంగాధర్ అన్నారు. భువనగిరిలోని ఎస్ఎల్ఎన్ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం జిల్లా గెజిటెడ్ ఉద్యోగుల అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సందర్భంగా ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇటీవల కురిసిన వర్షాలు, వరదలకు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు తమ వంతు విరాళాన్ని అందించడం అభినందనీయమన్నారు. ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడంలో ఉద్యోగ సంఘాలు తమ వంతు కృషి చేయాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఏలూరు శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ ప్రజలు, ప్రభుత్వానికి మధ్య ప్రభుత్వ ఉద్యోగ సంఘాలు ఒక వారధిగా పనిచేస్తున్నాయని, సమస్యల పరిష్కారంలో ప్రజలకు సహాయకారిగా ఉన్నాయని తెలిపారు. సామరస్యంగా హక్కులను కాపాడుకుంటూ సమస్యలను పరిష్కరించుకుంటామని, అవసరమైనప్పుడు అదనంగా పనిచేస్తామని చెప్పారు. ఎలక్షన్ ఆఫీసర్ రామారావు సమక్షంలో జిల్లా గెజిటెడ్ ఉద్యోగుల అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా గెజిటెడ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా జగన్మోహన్‌ప్రసాద్, జనరల్ సెక్రెటరీగా శ్రీనివాస్, కోశాధికారిగా హరి కృష్ణ, కార్యవర్గ సభ్యులుఉన్నారు. తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ ఉద్యోగుల సంఘం కోశాధికారి మం దడి ఉపేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర గెజిటెడ్ ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు జగన్, రాష్ట్ర పంచాయతీరాజ్ మినిస్టీరియల్ సర్వీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సత్యనారాయణరెడ్డి, వివిధ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, జిల్లా అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.